క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని కలిసిన సీఐ హనుమంత్‌నాయక్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ రూరల్ నూతన సీఐగా హనుమంత్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి జూన్‌లో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థానంలో ఉన్నతాధికారులు వైఎస్సార్ జిల్లా బద్వేల్ రూరల్‌లో విధులు నిర్వహిస్తున్న హనుమంత్‌నాయక్‌ను ఇక్కడికి పంపారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు సిబ్బందితో కలిసి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుజాత

ఆళ్లగడ్డ: రాజీ కాదగిన కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి సుజాత తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం స్థానిక న్యాయస్థానంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి కక్షిదారుల పరస్పర సమ్మతితో కేసులను పరిష్కరించాలని సూచించారు. కేసుల పరిష్కారం కోసం ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీలు సోమశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ తేజేశ్వరి

దొర్నిపాడు: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీఓ, ఎంపీడీఓ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైకేపీ కార్యలయంలో బాల్యవివాహల నిరోధక చట్టం, బేటి బచావో-బేటి పడావో వంటి కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని దీని వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రభాకరమ్మ, గుర్రం దీప్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలో గురువారం జియారత్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకు అతీతంగా జరుపుకోనే జియారత్‌లో భాగంగా భక్తులు పులగం, పానకం, చక్కెరలను సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మౌలాలి పీరును ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): శ్రీశైలం జలాశయం ద్వారా కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, హంద్రీనీవా, గాలేరునగరి కాలువలకు నీరు విడుదల చేసి పంటలను కాపాడి, రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రయోజనాలు కాపాడాలని, ఖరీఫ్ సీజన్ ముగిసినా రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఈ - క్రాప్ బుకింగ్ తప్పనిసరి

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మా ట్లాడారు.

నంద్యాల(అర్బన్): రైతులు సాగు చేసిన పంటను ఈ-పంటలో తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో గురువారం ఏఈఓ మణిమోహన్‌రెడ్డితో కలిసి ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(వ్యవసాయం): తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు కోరారు. గురువారం స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. సర్కిల్ సెక్రటరీ మద్దిరెడ్డి, డివిజన్ సెక్రటరీ జమాల్‌బాషా తదితరులు మాట్లాడుతూ 8గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరారు.

అభివృద్ధి.. సంక్షేమం

- నియోజకవర్గంలో వసతులకల్పనకు రూ.137.466 కోట్లు ఖర్చు
- రూ.71.94 కోట్లతో రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టుల నిర్మాణాలు
- సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1,307 కోట్లు జమ

ఆళ్లగడ్డ: అస్తవ్యస్తంగా మారిన పల్లె దారులు రయ్యిన దూసుకుపోయేలా నిర్మాణం.. రైతుల కోసం 'రైతు భరోసా కేంద్రాలు'.. పౌర సేవలకు 'గ్రామ సచివాలయాలు'.. ఇంటి ముంగిటికే ఆరోగ్యం కోసం 'విలేజ్ హెల్త్ క్లినిక్‌లు'.. పాడి రైతుల కోసం ' బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు'.. యువత కోసం డిజిటల్ లైబ్రరీలు..సంక్షేమ పథకాల ద్వారా వందల కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ.. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక నియోజకవర్గంలో ప్రజలు చూస్తున్న గొప్ప మార్పు ఇది. ప్రభుత్వ కార్యాలయాల భవనా ల నిర్మాణాలతో పల్లెలకు నూతన శోభ సమకూరింది.

రూ 24. 30 కోట్లతో 81 సచివాలయాల నిర్మాణాలు..

గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే మండల కేంద్రాలకు పరుగెత్తాల్సిందే. వాటి కోసం రోజులు తరబడి తిరాల్సి వచ్చేంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణులకు సుపరిపాలన అందించే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. వీటి కోసం ఆరు మండలాల్లో 81 గ్రామ సచివాలయాలను నిర్మించారు. ఇందుకు రూ 24.30 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుతం నిమిషాల్లో పనులు జరుగుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.17.65 కోట్లతో 81 ఆర్బీకేలు..

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు పట్టణాల్లోని దుకాణాల వద్ద క్యూ కట్టే అవసరం లేకుండా ఆర్బీకేలు ఏర్పాటు చేసింది. అలాగే.. దిగుబడులను కూడా అక్కడే కొనుగోలు చేస్తున్నారు. వీటి నిర్మాణానికి నియోజకవర్గంలో రూ.17.65 కోట్ల ఖర్చు చేసి 81 రైతు



రూ. కోటితో నిర్మించిన దొర్నిపాడు - అర్జునాపురం రోడ్డు

భరోసా కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేశారు.

రూ 5.25 కోట్లతో 30 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు..

గ్రామీణ వైద్యరంగంలో మార్పులు తెచ్చే ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గ్రామంలోనే జ్వరంతో పాటు ఇతర అనారోగ్యాలకు చికిత్స అందిచేందుకు ప్రతి 2500 మంది జనాభాకు ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేశారు. 90 రకాల మందులు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నారు. గ్రామ స్థాయిలో వైద్యసేవలందించేందుకు 30 భవనాలు నిర్మించారు. వీటికి రూ 5.25 కోట్లు ఖర్చు చేసింది.

పాల వెల్లువ కోసం..

పల్లెల్లో పాల వెల్లువ పరిఢవిల్లేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, నాణ్యమైన పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా నియోజకవర్గంలో రూ.4.80 కోట్లు ఖర్చు చేసి 30 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లకు ఏర్పాటు చర్యలు చేపట్టింది.

రయ్..మంటూ సాగిపోయేలా..

నియోజకవర్గంలో ఏగ్రామానికైనా దూసుకుపోయేలా రోడ్లు, బ్రిడ్జీలు నిర్మించారు. దీంతో దశాబ్దాలుగా పల్లె వాసులు పడుతున్న అవస్థలకు తెరపడినట్లైంది ఇందుకు గాను నియోజకవర్గంలో 138.608 కి.మీ. నిర్మాణ పనులకు రూ రూ.71.94 కోట్లు ఖర్చు చేసింది.



జమ్ములదిన్నెలో నిర్మించిన ఆర్బీకే

రూ.1,307 కోట్లతో సంక్షేమం..

నియోజకవర్గంలో నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1,307 కోట్లు జమ చేసింది. 91 గ్రామ, వార్డు సచివాలయాలు పరిధిలో 104 గ్రామ పంచాయతీలు ఒక పురపాలక సంఘం ఉన్నాయి. వీటి పరిధిలో 82,533 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 3,00,573 మంది వివిధ సక్షేమ పథాలక ద్వారా రూ.1307,03,24,062 లబ్ధి చేకూరింది.

మండలాల వారీగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఖర్చు చేసిన నిధులు, చేపట్టిన పనులు..

గ్రాంట్	చేపట్టిన పనులు	ఖర్చుపెట్టింది (రూ.లక్షల్లో)
గడగడపకు	72	408.45
సీఎండీఎఫ్	10	95.35
ఎంపీ నిధులు	15	181.10
జెడ్పీ నిధులు	08	75.00
ఎంజీఎన్ఆర్ఈజీఎస్	122	871.61
గ్రామ సచివాలయాలు	81	243.00
ఆర్బీకేలు	81	176.58
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	30	52.50
బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు	30	52.50
డిజిటల్ లైబ్రరీలు	24	387.5

గ్రామంలోనే సమస్యలన్నీ పరిష్కారం



గ్రామంలో దాదాపు అందరూ రైతు కుటుంబాలే ఉన్నాయి. ఉదయాన్నే పనిలోకి పోతే రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే ఉండాల్సి వస్తుంది. ఏదైనా పనులు కావాలంటే ఆళ్లగడ్డకు వెళ్లాల్సి రావడంతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు గ్రామలోనే సచివాలయం, ఆర్బీకేలు నిర్మించడంతో పాటు పాల కేంద్రం నిర్మాణం కూడా పూర్తి కావచ్చింది. దీంతో మాగ్రామంలోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయి.

- కృష్ణారెడ్డి , ఆర్.కృష్ణాపురం

నాటి కష్టాలు ఇప్పుడు లేవు



జగనన్న ప్రభుత్వంలో మా గ్రామానికి అన్నిరకాల సదుపాయాలు సమకూరాయి. గతంలో ఏమస్య వచ్చినా 10 కి.మీ దూరంలో ఉన్న పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. ఎప్పడు పరిష్కారం అవుతాయో తెలిసేది కాదు. నాటి కష్టాలు ఇప్పుడు లేవు. అన్ని గ్రామంలోనే పరిష్కారం అవుతున్నాయి. వలంటీర్ల ద్వార పింఛన్‌లతో పాటు సంక్షేమ పథకాలు అన్ని ఇంటి దగ్గరకే వస్తున్నాయి.

- అరుణ, నల్లగట్ల

వర్షాలు ఆలస్యమైనా..వరి నాట్లకు ఇబ్బంది లేదు

నంద్యాల(సెంట్రల్): ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షాలు కాస్త ఆలస్యమైనా..వరి నాట్లకు ఎటువంటి ఇబ్బంది లేదని, సెప్టెంబర్ మొదటివారం వరకు పరిస్థితి అనుకూలంగా ఉందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో గురువారం శిక్షణ సందర్శన సమావేశం నిర్వహించారు. సహ సంచాలకులు వెంకటేశ్వర్లు, కర్నూలు ఇన్‌చార్జ్ ఏడీ బాలవర్ధిరాజు పాల్గొన్న ఈ సమావేశంలో గత జూలైలో వాతావరణం, వర్షపాతం వివరాలు, పంటల సరళి, చీడపీడల యాజమాన్యంపై చర్చ జరిగింది. ఎస్సార్బీసీ, కేసీ కాలువ, తెలుగుగంగకు నీటి విడుదల సకాలంలో జరిగితే నాట్లకు ఇబ్బంది ఉండదని, లేనిపక్షంలో ఆరుతడి పంటల సాగుకు రైతన్నలు ఉపక్రమించాలని శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఎన్‌డీఎస్‌హెచ్‌సీ1012(ప్రభాత్) రకం హైబ్రీడ్ పొద్దుతిరుగుడు, ఐఎస్ఎఫ్-764 రకం కుసుమ, శనగలో కాబూలీ రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు జయలక్ష్మి, రవికుమార్, రాణమ్మ, సుజాతమ్మ, ధనలక్ష్మి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ ప్రక్రియ



నర్సిపల్లెలో అభ్యర్థి నుంచి నామినేషన్ పత్రాన్ని స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి

ఆళ్లగడ్డ: కోటకందుకూరు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. చివరిరోజు గడువు ముగిసే సరికి 13 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడంతో మూడు రోజులకు కలిపి మొత్తం 16 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామకృష్ణనాయక్ తెలిపారు.కాగా సర్పంచ్ పదవికి పోటీలో ఉన్న అభ్యర్థులు.. సుంగల రియజ్, అల్లిసాబ్‌గారి ముక్తార్, నల్లగట్ల ఇందసేనా రెడ్డి, మొగల్‌ఖాదర్ వలిబేగ్, దుర్వేసుల సులోచన, ముల్లా ఫరూక్, ఎన్ లక్ష్మీదేవి, ఆర్ల నాగశ్రీనివాసులు, పార్వ నరసింహ, ఆర్ల నాగమ్మ, నర్సిపల్లె ఇస్మాయిల్, నర్సిపల్లె అబ్దుల్ మజీద్, నర్సిపల్లె మహమ్మద్‌రఫీ, రాయని శ్రీనివాసులు, దర్వేసుల ప్రసాద్, ముల్లాసుబాన్ నామినేషన్ వేశారు.

ఉయ్యాలవాడ : మండలంలో ఖాళీగానున్న వార్డు మెంబర్లకు సంబంధించి మంగళవారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. నర్సిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో 5వ వార్డుకు ముళ్ల గౌస్‌బీ నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఈ వార్డు జనరల్ కేటాయించగా ప్రాతినిథ్యం వహిస్తున్న ముళ్లా మాబుహుసేన్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన సతీమణి గౌస్‌బీ నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఫణీత్‌కృష్ణ తెలిపారు. అలాగే హరివరంలోని 7వ వార్డుకు చౌడమ్మ నామినేషన్ దాఖలు చేశారు. రెండు గ్రామాల్లో ఒక్కో అభ్యర్థి మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించే అవకాశముంది.

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలోని 1వ వార్డు సభ్యుడి ఎన్నిక కోసం నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసిందని రిటరింగ్ అధికారి రామచంద్రయ్య తెలిపారు. బీసీ జనరల్‌కు కేటాయించిన వార్డుకు నరసింహుడు, శ్రీనివాసులు, హుసేన్‌బాషా, నాగరత్తు అనే నలుగురు నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు.

శిరివెళ్ల: మండలంలోని 3 గ్రామ పంచాయతీలకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి. యర్రగుంట్ల 8వ వార్డుకు గుత్తి బాలరంగయ్య, నడిపి రంగన్న, గుండాబత్తుల వెంకటసుబ్బయ్య, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, బెలుగూరి వెంకట రమణ నామినేషన్ వేశారు. వనికిదినిదిన్నె 5వ వార్డుకు జిలకర్ర సుశీలమ్మ, జిలకర కుమారి నామినేషన్లు దాఖలు చేశారు. గుంప్రమాన్‌దిన్నె 12వ వార్డుకు వట్టి కూరి భారతి ఒక్కరే నామినేషన్ వేశారు.

చాగలమర్రి: ఉప ఎన్నికల నామినెషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది.మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలోని 5వ వార్డుకు ఐదుగురు నామినేషన్ చేశారని రిటర్నింగ్ అధికారి అనురాధ తెలిపారు. అలాగే రాంపల్లె గ్రామంలో 3వ వార్డుకు సంబంధించి నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు రిటర్నింగ్ అధికారి జగ్గయ్యకు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు.

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ పంచాయతీలు, 55 వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. గురువారం ముగిసిన పంచాయతీ సర్పంచ్‌ల ఎన్నికకు సంబంధించి 26 నామినేషన్లు దాఖలు కాగా 55 వార్డు స్థానాలకు 144 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఏకగ్రీవమైన అన్నవరం పంచాయతీ..

అవుకు మండలం అన్నవరం పంచాయతీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మద్దతుదారుడు సాయినాథరెడ్డి ఒక్కడే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి రామకృష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నికైన పత్రాన్ని అందజేశారు. అలాగే ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు పంచాయతీకి 16 నామినేషన్లు, కొలిమిగుండ్ల మండలంలోని కనకాద్రిపల్లెకి 9 నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు.

17మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవం..

జిల్లాలోని పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 55 వార్డు మెంబర్లలో 17 చోట్ల ఒకే నామినేషన్ దాఖలు కావడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. అందులో మెజార్టీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు ఉన్నారు. ఒకే నామినేషన్ దాఖలైన వాటిలో బనగానపల్లె మండలం అప్పలాపురం, రామకృష్ణాపురం, బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ, రామాపురం, గోస్పాడు మండలం రాయపాడు, మిడుతూరు మండలం వీపనగండ్ల, అవుకు మండలం కొండమనాయునిపల్లి, పాములపాడు, కొండజూటూరు, కొలుపల్లి, మునిమడుగు, నల్లమేకలపల్లి, రుద్రవరం మండలం నర్సాపురం, సంజామల మండలం పేరుసోముల, గుంప్రమాన్‌దిన్నె, హరివరం, నర్సిపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పేర్కొన్నారు.

పంటలకు ఊపిరిలూదిన వర్షం



ఎర్రగుడిదిన్నె సమీపంలో కళకలాడుతున్న మినుము పంట

రుద్రవరం: మండలంలో గురువారం తెల్లారువారుజాము నుంచి మోస్తారు వర్షం కురిసింది. తో ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము,మొక్కజొన్న తదితర పంటలకు ఊపిరి పోసినట్లయ్యింది. మండలంలోని ఎర్రగుడిదిన్నె,పేరూయ, చిలకలూరు, చందలూరు, నక్కలదిన్నె, నర్సాపురం, అప్పనపల్లె, టీ.లింగందిన్నె,శ్రీరంగాపురం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో మినుము,మొక్కజొన్న పంటలు సాగు చేశారు. కొద్ది రోజులుగా వర్షం కురవక పంటలు వాడు ముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందారు.

దొర్నిపాడు: ఖరీఫ్‌లో భాగంగా సాగుచేసిన పంటలకు గురువారం వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విత్తిన పత్తి మొలక దశలో ఉంది. కొద్ది రోజులుగా వర్షం జాడ లేకపోవడంతో వాడుముఖం పట్టాయి. ఎట్టకేలకు ప్రస్తుతం కురిసిన వాన ఊరటనిచ్చింది. అలాగే కాయ, కంకి దశలో ఉన్న మినుము, మొక్కజొన్న పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి

చాగలమర్రి: కార్డుదారుల ఇంటి వద్దకే మొబైల్ రేషన్ పంపిణీ చేయటానికే ప్రభుత్వం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసిందని ఆళ్లగడ్డ సీఎస్‌డీటీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంపిణీ ఎలా ఉందని, పంపిణీదారులు ముందస్తు సమాచారం ఇస్తున్నారా? లేదా? అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయరెడ్డి, మౌలాలి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కౌన్సిలర్లు రవీంద్రారెడ్డి, రషీద్ అహమ్మద్ ఖాన్, జిల్లా కౌన్సిలర్లు హరిహరనాథ్‌రెడ్డి, దాదాపీర్ ఉన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

నంద్యాల(వ్యవసాయం): కేంద్ర ప్రభుత్వం సర్పంచ్‌లకు ఇస్తున్న నిధులు దారి మళ్లించడాన్ని వ్యతిరేకిస్తూ నంద్యాల పార్లమెంట్ కన్వీనర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌లు, బీజేపీ నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

తల్లిదండ్రులు సహకరించాలి

రుద్రవరం: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించేందుకు పాఠశాలలో తమ వంతు కృషి చేస్తున్నామని అయితే ఇళ్ల వద్ద కూడా వారు చదువుకునేలా చేస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

నంద్యాలటౌన్: మండలంలో బిల్లలాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రోటరీ క్లబ్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు రాధిక, మధుసూధన్ వాటర్ క్యాన్లు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ నంద్యాల అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతు పాఠశాల విద్యార్థులకు నిత్యవసర సామాగ్రి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపడతామన్నారు.

కాల్వల్లో చెత్త వేస్తే చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలోని మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సంజీవనగర్ గేట్ వద్ద మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాలు, గృహాల నుంచి రోజువారీగా వెలవడుతున్న వ్యర్థాలను మున్సిపల్ క్లాప్ వాహనాలకు అందించాలని సూచించారు. మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం

జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశాల మేరకు గురువారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛానల్ ఆక్రమణలపై మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి, డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డిలతో కలిసి పరిశీలించారు.

బాల్య వివాహాలు నేరం

శిరివెళ్ల: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సీడీపీఓ తేజస్విని అన్నారు. గురువారం ఏంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాలపై అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడు ఇటీవల శిరివెల్లలో 10వ తరగతి బాలికకు పెళ్లి జరిపిస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రుద్రవరం: మండలంలోని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యులు అమర్‌నాథ్‌రెడ్డి, గాయిత్రి గురువారం సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 9 గ్రామ సచివాలయాల పరిధిలో పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,746 మంది చిన్నారులు ఉన్నారు. అందులో 5,642 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అలాగే నర్సాపురం పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడి కేంద్రాల్లోని విద్యార్థులు, చిన్నారులకు మాత్రలు వేయించారు.

శిరివెళ్ల: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణకు అల్బెండర్ జోల్ మాత్రలను వేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5,130 మంది విద్యార్థులకు గాను 5,009 మందికి మాత్రలు వేశామని డాక్టర్ విజయకుమార్ తెలిపారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం , సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి, హెచ్ఎం విజయ కుమార్ పాల్గొన్నారు.

చాగలమర్రి: జాతీయ నూలి పురుగుల నివారణోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ వైద్యాధికారి షేక్ ఇమ్రాన్ విద్యార్థులకు ఆల్బెండజోల్ గుళికలను అందజేశారు. మండలంలో 10,041 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. డాక్టర్ సుల్తానా, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ పాల్గొన్నారు.

'నా భూమి - నా దేశం' మహోన్నతం

గోస్పాడు: నేల తల్లిని కాపాడాలని, భావి తరాలకు సారవంతమైన నేలను అందించే దిశగా ప్రతి ఒక్కరూ నడవాలని ఉపాధి పీడీ రామచంద్రారెడ్డి కోరారు. ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని జూలేపల్లె, ఎం.చింతకుంట్ల, పసురపాడు గ్రామాల సచివాలయాల వద్ద గురువారం నాభూమి-నా దేశం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. నా మట్టి-నాదేశం కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. సర్పంచ్‌లు గడ్డం లలితమ్మ, వంగూరి మల్లేశ్వరి, ఈఓఆర్డీ అనసూయ, ఏపీఓ నాగజ్యోతి, ఈసీ మహేష్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: జన్మనిచ్చిన నేల తల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన 'నా భూమి - నా దేశం' కార్యక్రమం మహోన్నతమైందని ఈటీపీఆర్డీ జీఎండీ తాహిర్ హుసేన్ పేర్కొన్నారు. రూరల్ మండలం కోటకందుకూరు ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో గురువారం నా భూమి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. మొదట జాతిపిత మహాత్మాగాంధీ, నేతాజీ ఫొటోలకు పూలమాల వేసి నివాళులర్పించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ పతావిష్కరణ చేసి పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ రాజు, ఏపీఓ గణేష్ ఉన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పీడీ, అధికారులు

నంద్యాల(అర్బన్): ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మండలంలోని చాబోలు, అయ్యలూరు, పాండురంగాపురం, చాపిరేవుల, పుసులూరు గ్రామాల్లో గురువారం నా భూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలను నిర్వహించారు. పాండురంగాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ డోలావతమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చాపిరేవుల సర్పంచ్ దేవి, ఎంపీటీసీలు తియ్యగూరు లక్ష్మి, ఎద్దుల రత్నమ్మ పాల్గొన్నారు.

శతక పద్యాలతో నైతిక విలువలు

నంద్యాల(వ్యవసాయం): తెలుగు శతకాలు విద్యార్థుల్లో నైతిక విలువలు, సంస్కారం, క్రమశిక్షణ పెంపొందిస్తాయని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన విశ్రాంత తెలుగు పండితులు విద్వాన్ శ్రీ చుంచు నరసింహులు రచించిన నరసింహ శతక పద్యాల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులకు శతక పద్యాలు నేర్పిస్తే వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. కవి నరసింహులు మాట్లాడుతూ దాదాపుగా15 సంవత్సరాల క్రితం విద్యార్థుల కోసం రాసుకున్న నీతి పద్యాలను కుటుంబ సభ్యులు, మిత్రుల ప్రోత్సాహంతో పుస్తక రూపంలోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ నరసింహ శతకాన్ని ఆటవెలది పద్య రూపంలో వెంకటేశ్వర స్వామి పేరును మకుటంగా చేసుకుని అందరికీ అర్థమయ్యేలా సరళంగా రచించానని చెప్పారు. అనంతరం సాహితీ సంస్థల ప్రతినిధులు రచయితను సన్మానించారు. కే.వివేకానంద, కే.మురళీకృష్ణారావు,కిషోర్ కుమార్, శేషఫణి, నీలకంఠమాచారి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వరుణుడిపై ఆశతో..

ఉయ్యాలవాడ : గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులకు బాగా కలిసొచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు అదునైన వర్షం కురవలేదు. ఒక వైపు శ్రీశైలం, అవుకు, వెలుగోడు రిజర్వాయర్లలో నీటి నిల్వలు అంతంత మాత్రమే ఉండటం, వర్షాధార పంటలు మాత్రమే సాగు చేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అయితే గురువారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. మిరప సాగుకు వాతావరణం అనుకూలిస్తుండడంతో ఇంజేడు, ఉయ్యాలవాడ, తదితర గ్రామాల్లో రైతులు మిరప నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. గత ఏడాది మండలంలో 1200 ఎకరాల్లో మిరప, సూపర్-10, తేజా, తదితర రకాలు సాగు చేశారు. ఎకరాకు 20 నుండి 25 క్వింటాళ్లు దిగుబడులు వచ్చాయి. క్వింటా మార్కెట్‌లో రూ. 25 వేలకు పైగా ధర పలికింది. పెట్టుబడులు పోను ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం చేకూరింది. దీంతో ఈ ఏడాది కూడా రైతులు రెట్టింపు ఉత్సాహంతో అదే పంటపై ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి డ్యామ్‌ల్లో నీటి నిల్వలు పెరిగితే కుందూనది తీరం వెంట గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.



ఉయ్యాలవాడ సమీపంలో మిరప నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో విధి నిర్వహణలో మృతి చెందిన హోంగార్డు రాజశేఖర్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు అందజేశారు. స్థానిక కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఫ్యామిలీ ఇన్సూరెన్స్ కింద రూ. 20 వేలు అందజేశామని చెప్పారు.

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్..



చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంటూరు జిల్లా సెబ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా గురువారం మణికంఠ పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆయన జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.